క్లుప్తంగా

ఎన్‌సీసీ అధికారికి పదోన్నతి



తెనాలి: స్థానిక కొత్తపేటలోని శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూల్ ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్‌కు సెకండ్ ఆఫీసర్ గా పదోన్నతి లభించింది. గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ ఎం చంద్రశేఖర్, 22వ ఆంధ్ర బెటాలియన్ ఆఫీషియేటింగ్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్‌లు సర్దార్‌కు రెండు స్టార్‌ల పట్టీని పాఠశాల ఎన్‌సీసీ అధికారి సర్దార్‌కు అలంకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుని షేక్ మౌలాబి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సర్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

బాలికల వసతి గృహం తనిఖీ



తెనాలిరూరల్: పట్టణ ఆర్ఆర్‌నగర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తహసీల్దార్ గోపాలకృష్ణ శనివారం రాత్రి తనిఖీ చేశారు. బాలికలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించడంతో పాటు ఆవరణను పరిశీలించారు. పట్టణానికి చెందిన కాంట్రాక్టరు సూర్యదేవర భువన్, తహసీల్దార్ మిత్ర బృందం సహకారంతో వసతిగృహానికి ఫ్యాన్లు, లైట్లు, దోమతెరలు అందించడంతో పాటు అవసరమైన గదులకు తలుపులు, మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేయించి ఫ్లోరింగ్ చేయిచారు. వసతిగృహంలో పదో తరగతిచదువుతున్న విద్యార్థులు 10 మంది ఉండగా పరీక్షల్లో మంచి మార్కులు వచ్చిన వారికి ప్రోత్సాహక బహుమతులను ఇస్తామని చెప్పారు. తవరలో ప్రహరీ నిర్మాణానికీ చర్యలు తీసుకుంటామన్నారు.

గోవాడ తిరునాళ్ల పోస్టరు ఆవిష్కరణ



తెనాలి: బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని అమృతలూరు మండల గ్రామం గోవాడలో గల శ్రీబాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్ల పోస్టరును శనివారం రాత్రి తెనాలిలో వేమూరు ఎమ్మెల్యే, మాజీమంత్రి నక్కా ఆనందబాబు ఆవిష్కరించారు. స్థానికంగా ఓ సమావేశంలో పాల్గొనేందుకు ఎన్‌వీఆర్ కన్వెన్షనుకు వచ్చిన ఎమ్మెల్యే ఆనందబాబుచే ఆలయ కమిటీ, అధికారులు పోస్టరును ఆవిష్కరింపజేశారు. సంబంధిత కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రక్షణసైన్య ప్రార్ధనా మందిరం వార్షికోత్సవం



తెనాలి: పట్టణ అయితానగర్‌లోని రక్షణ సైన్య ప్రార్ధనామందిరం అయిదో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. లెఫ్టినెంట్ కర్నల్ గేరా థామస్, లెఫ్టినెంట్ కర్నర్ గేరా సియోనుకుమారి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మన అవసరాలు, బాధలను దేవునికి తెలియజేసి, దీవెనలు అందుకునేందుకు మంచి ప్రార్ధనా మందిరాన్ని దేవుడు ఇచ్చాడని వారు ప్రజలకు తెలియజేశారు. సంఘకాపరి మేజర్ నాగరాజు, మేజర్ రత్నసుందరి, సంఘపెద్దలు గాలి రవికుమార్, పిల్లి కనకరత్నం, బట్టు జక్రయ్య, కారుమంచి నరసింహ, రుద్రపాటి ఆశీర్వాదం, సంఘం యవ్వనస్తులు కలిసి వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపారు. అనంతరం విందు భోజనం ఏర్పాటుచేశారు.

హెచ్ఐవీ బాధితులకు పోషకాహారం పంపిణీ



తెనాలిరూరల్: బ్యాంకింగ్ సేవలతో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న అంగలకుదురు బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి అధికారులు, సిబ్బందిని పలువురు అభినందించారు. అంగలకుదురులోని బ్యాంక్ ఆఫ్ బరోడ్ వద్ద శనివారం హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. బ్యాంక్ సీనియర్ మేనేజర్ నవజ్యోతి చేతుల మీదుగా బాధితులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు సిబ్బందికి పలువురు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫీసర్‌లు డి. గోపి, అరవింద శాస్త్రి, పి.రమ్యదీప్తి, బి.ప్రియదర్శిని, ఖాతాదారులు బండి జగన్మోహన రావు, చెన్నుపాటి రవీంద్ర, ముక్కామల మధుబాబు పాల్గొన్నారు.

సొంతింటి ఆశలపై కూటమి నీళ్లు



కొల్లిపర మండలం జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు



కొల్లిపర మండలంలో జగనన్న కాలనీలో వివిధ దశలో నిలిచి పోయిన గృహ నిర్మాణాలు

కొల్లిపర: ప్రతి పేదవాడి సొంతింటి కలలను నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తే ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం షరతులు విధిస్తోంది. పేదల సొంతింటి ఆశలపై నీళ్ల చల్లుతోంది. కూటమి అధికారం చేపట్టిన తరువాత మన ఇల్లు–మన గౌరవం పేరుతో అధికారులు హడావుడి చేస్తున్నారే తప్పా లబ్ధిదారులకు ఏ మాత్రం భరోసా కల్పించడం లేదు. ఇప్పటికే గృహ నిర్మాణాలు చేపట్టి, కుటుంబం ఆర్థికంగా లేనందుకు అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్లను మార్చిలోపు పూర్తి చేయకపోతే, అసలు నిర్మాణాలు చేపట్టని వారి పట్టాలు రద్దు చేస్తామని షరతులు విధించడంతో లబ్ధిదారుల్లో ఆందోళన చెందుతున్నారు.

- మార్చి లోపు పూర్తి చేయాలంటూ టీడీపీ సర్కార్ షరతులు
- మన ఇల్లు–మన గౌరవం పేరుతో హడావిడి
- నిర్మాణం చేయకపోతే పట్టా రద్దు చేస్తామంటూ హెచ్చరికలు
- అయోమయంలో లబ్ధిదారులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విస్తృతంగా ఇళ్ల నిర్మాణాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలతోపాటు గృహాలను మంజూరు చేసింది. 2021లో మండల వ్యాప్తంగా అప్పటి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు వల్లభాపురంలో ఆన్‌లైన్‌లో వీడియో ద్వారా బటన్ నొక్కి ఆయన ప్రారంభించగా స్థానికంగా అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతులు మీదుగా శంకుస్థాపనలు చేశారు. మండలంలో 20 గ్రామాలలోని ప్రజలకు మొత్తం 28 లేఅవుట్ల ద్వారా మొత్తం 2190 మంది పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. గృహ నిర్మాణాల కోసం ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ పరంగా రూ.1.80 లక్షల ఆర్థిక సాయంతో పాటు, పొదుపు మహిళలకు అదనంగా బ్యాంకుల నుంచి రూ.35 వేలు మరోరూ.20 వేలు ఉపాధి పథకం కింద వర్తించేలా ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రభుత్వం ఆర్థిక సాయంతోపాటు, ఇసుక, ఇనుప కడ్డీలు, సిమెంటును అందుబాటులోకి తెచ్చింది గత ప్రభుత్వం. ఎన్నికల సమయానికి మండలంలో 1105 గృహాలు మాత్రం వివిధ దశల్లో నిలిచి పోయాయి. మండలంలో పేద ప్రజలకు ఇంటి స్థలాలు కోసం సుమారు రూ.60 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

మూడు సెంట్ల మాట వినపడదే?

గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి తాము అధికారంలోకి వస్తే పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాల చొప్పున ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని చెప్పిన విషయం తెలిసిందే. టీడీపీ, కూటమి సర్కార్ కొలువుదీరి ఏడునెలలు దాటినా ఇంటి స్థలం కోసం దరఖాస్తులు కూడా స్వీకరించడం లేదని పెదలు విమర్శలు గుప్పిస్తున్నారు.

కొల్లిపర మండలంలో జగన్నన కాలనీలు నిర్మాణాల పురోగతి వివరాలు

దశ	లేఅవుట్ స్థలం
బీబీఎల్	664
బీఎల్	376
ఎల్ఎల్	26
ఆర్ఎల్	35
ఆర్‌సీ	04
పూర్తి	586
మొత్తం	1691

మార్చి లోపల నిర్మించుకోవాలి

గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లను 2025 మార్చిలోగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని 28 జగనన్న హౌసింగ్ లేఅవుట్ల కింద 2190 మంది లబ్ధిదారులు ఉండగా వీరిలో 1691 మందికి ఇళ్లు మంజూరు చేశాం అందులో ఇప్పటి వరకు 586 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం చేస్తున్నారు. మిగతావి 1105 వివిధ నిర్మాణ దశలో నిలిచి పోయాయి. ఈ ఇళ్లను మార్చి 30 నాటికి పూర్తి చేసుకోవాలి. గడువు తర్వాత నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు నిలిపి వేయడం జరుగుతుంది. ప్రస్తుతం లేవుట్‌లో గృహ నిర్మాణాలకు మంజూరు కాలేని వారు సొంతం స్థలంలో గృహ నిర్మాణాలు చేపట్టే వారికి పిఎంఏవై2.0 పథకం ద్వారా అర్హులైన వారు నమెదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం 2.80 లక్షలు అందిస్తోంది. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలి.

–కొల్లిపర మండలం ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ గౌసుద్దీన్

పొగడ మానోత్సవంలో భావనారుషి స్వామి



స్వామివారి పొగడమానోత్సవం

తెనాలి: పట్టణ షరాఫ్‌బజారులోని శ్రీభద్రావతిసమేత శ్రీభావనాఋషిస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా శనివారం రాత్రి పొగడ మానోత్సవం ఘనంగా నిర్వహించారు. పొగడ మానుపై స్వామివారి ఊరేగింపులో పురవీధుల్లో సాగింది.పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీపద్మశాలీయ బహుత్తమ సంఘం, శ్రీభద్రావతి సమేత శ్రీభావనాఋషిస్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో పెద్ద శ్రేష్టులు జొన్నాదుల కృష్ణ సత్యనారాయణ, జొన్నాదుల వెంకట కోటేశ్వరరావు, తాడిపర్తి శివ సత్యనారాయణ వరప్రసాద్, శ్రీపద్మశాలీయ బహుత్తమ సంఘం గౌరవ అధ్యక్షుడు జొన్నాదుల మహేష్, గౌరవ సలహాసభ్యులు అక్కల శ్రీరామ్, దివి హేమంత్ కుమార్, గుంటి వెంకట్, అధ్యక్షుడు తిరువీధుల సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి పంచమర్తి భాస్కరరావు, కోశాధికారి గట్టు బాల శ్రీనివాసరావు, ఉత్సవనిర్వహణ కమిటీ చిన్నం హరిగోపాల్, జొన్నాదుల మదన్మోహన్రావు, ఆకురాతి శ్రీనివాసరావు, గుంటి ధనలక్ష్మి, తాడిపత్రి శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

వైకుంఠపురాన హరినామ సంకీర్తన



సంకీర్తనలు గానం చేస్తున్న గాయకులు

తెనాలి: స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం వైకుంఠపురంలో శ్రీహరినామ సంకీర్తన బృందం, తెనాలిచే 'వారం భజన'ను శనివారం ప్రారంభించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి/ సహాయ కమిషనర్ వి.అనుపమను మర్యాదపూర్వకంగా కలిసి సంకీర్తనను ప్రారంభించారు. సంకీర్తన బృందం గురువు పెరవలి వంశీకృష్ణ, అందె బాలచంద్రమౌళి, రాజేశ్వరి, తన్మయ, దంటు శర్వాణి, నందికంటి జయలక్ష్మి, నందికంటి రామాంజనేయులు, భాగ్యలక్ష్మి, కొత్తమాసు పుష్పలత, కొప్పరవు అనితమాధవి, నందికంటి పూజిత, కొండయ్య పాల్గొన్నారు.

తెనాలి చైర్‌పర్సన్‌కు సత్కారం



చైర్‌పర్సన్ రాధిక రమేష్‌కు సత్కారం

తెనాలి: పారిశుద్ధ్య పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ తెనాలి పట్టణాన్ని సాధ్యమైనంత సుందరంగా ఉంచేలా మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్ కృషిచేయటం ముదావహమని ఆర్‌పీఐ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు అన్నారు. పార్టీ తరపున శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ చాంబరులో రాధిక రమేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుతం తెనాలి పట్టణంలో పారిశుద్ధ్య పనులను చాలా సమర్థవంతంగా, సమయస్ఫూర్తితో నిర్వహిస్తున్నారని కొనియాడారు. ప్రతిరోజు ఏదో ఒక వార్డులో పర్యటిస్తుండటాన్ని గమనించినట్టు తెలిపారు. ఇందుకోసం వ్యక్తిగత్తంగా, పార్టీపరంగానూ అభినందిస్తున్నట్టు తెలిపారు. ప్రతినిత్యం ప్రజా సేవలో ఉంటామని పారిశుద్ధ్య పనుల్లో ఎటువంటి ఇబ్బందులు కలిగినా, ఆ సమస్యని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీనిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ కొల్లిపర మండల అధ్యక్షుడు తుంగ బాలస్వామి, గుంటూరు జిల్లా మానవ హక్కుల కార్యకర్తలు రేఖ, పవన్, తేజ, శ్రావణ్, అశోక్ పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారి ఆత్మార్పణ విశిష్టమైనది



అనుగ్రహ భాషణ చేస్తున్న బాలస్వామీజీ



హాజరైన భక్తులు

అనుగ్రహ భాషణలో శ్రీప్రజ్ఞానంద సరస్వతీ (బాలస్వామీజీ)

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో జరిగిన అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో శుక్రవారం రాత్రి ప్రజ్ఞానంద సర్వసతి (బాలస్వామీజీ) వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భారీ బహిరంగసభలో భక్తుల నుద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. వాసవీ అమ్మవారి ఆత్మార్పణ విశిష్టతను భక్తులకు తెలియజేశారు. అమ్మవారి భక్తి కీర్తనలు, పిల్లలచే భరతనాట్యం చేయించారు. అమ్మవారిని రథంపై ఆసీనురాలును చేసి పురవీధుల్లో మేళతాళాతలతో ఊరేగింపు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, నంబూరి వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, నాళం రజనీకుమార్, దేవస్థానం కమిటీ సభ్యులు, సాలిగ్రామ మఠం సభ్యులు, శ్రీవిద్యాపీఠం సభ్యులు బాలస్వామీజీతోపాటు పురవీధుల్లో ఊరేగింపులో పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్ల పంపిణీలో సబ్‌కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: రెడ్‌క్రాస్, తెనాలి శాఖ ఆధ్వర్యంలో రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని ముక్తి ట్రైబల్ రెసిడెన్షియల్స్ స్కూలు విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ చేతుల మీదుగా స్కూలులోని 200 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఈ వితరణ చేశారు. రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, హ్యాపీ హాస్పటల్ నిర్వాహకురాలు డాక్టర్ పావనీ ప్రియాంక సహాయంతో వీటిని అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణమూర్తి, సభ్యులు కుర్రా విజయలక్ష్మి, 13వ వార్డు కుర్రా సుజాత, మానేపల్లి బుచ్చిబాబు, నూరే సాంబశివరావు, ముక్తి స్కూల్ కరస్పాండెంట్ జైపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాల్వల్లో వ్యర్థాలు లేకుండా చూడండి

అసిస్టెంట్ వీఎం లక్ష్మిపతిరావు



షీల్ట్ పనులను పరిశీలిస్తున్న ఏసీ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: కాల్వల్లో వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మిపతిరావు సూచించారు. చెంచుపేట, మార్కెట్ ఏరియాలో శనివారం జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల పారుదల నిలిచి దోమలకు ఆవాసాలుగా మారతాయని తెలిపారు. కాల్వలను ప్రతిరోజు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

గుణాత్మక విద్యనందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎం.నాగిరెడ్డి

కర్లపాలెం: విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి చెప్పారు. మండల పరిధిలోని కొత్తనందాయపాలెం ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించి విద్యార్థులతో కలసి ఆయన భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠాలను సులభరీతిలో అర్థం చేసుకునే విధంగా బోధన సాగాలని చెప్పారు. విద్యార్థులకు చదువుతో పాటు పరిశుభ్రతపై అవగాహన కలిగించాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, సాంకేతిక విద్యపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంఓ బి.మోజెస్, ఎంఈఓ టీయూ మనోరంజని, సీఆర్పీలు లక్ష్మి, పోతురాజు తదితరులు ఉన్నారు.

అందరివాడు.. తహసీల్దారు గోపాలకృష్ణ

- ఉత్తమ తహసీల్దార్‌గా ఉన్నతాధికారుల ప్రసంశలు
- రైతుల భూమి రికార్డుల సవరణతో మెప్పుకోలు



కేవీ గోపాలకృష్ణ



ఉత్తమ తహసీల్దార్‌గా జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న గోపాల కృష్ణ

తెనాలి: ఎవరో కొందరు ఇచ్చిన అర్జీల పరిష్కారంతోనే ఆయన ఊరుకోలేదు. ఒకే సమస్యతో పలువురు ఎందుకొస్తున్నారు? అసలు మూలం ఎక్కడుంది? అని ఆలోచన చేశారు. రికార్డులు పరిశీలన చేశారు. అనేక వేల రికార్డుల్లో అదే సమస్య... రైతులను బాధిస్తోన్న నిషేధిత సమస్య... సిబ్బందిని పురమాయించి రేయింబవళ్లు పనిచేసి పరిష్కరించారు. అందరి మన్ననలే కాదు... ఉన్నతాధికారుల ప్రశంసలను అందుకున్నారు. ఫలితంగానే రిపబ్లిక్ డే రోజున ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాన్ని సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతులమీదుగా అందుకున్నారు.

ఆ అధికారి తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ. అందరితో కలివిడిగా ఉంటూ అర్జీతో వచ్చిన సామాన్యుడితో సహా పలకరించి, సమస్యను తెలుసుకుని తన పరిధిలోనిది అయితే సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేయటం ఆయన నైజం. తనకోసం వచ్చింది సీనియర్ సిటిజన్ అయితే కుశలప్రశ్నలు అడిగి మరీ పనిని సానుకూలంగా చేసి పెడుతున్నారు. ఎన్నికల అనంతరం తెనాలికి బదిలీపై వచ్చారాయన. గతంలో తెనాలి ప్రాంతంలోనే రెవెన్యూ అధికారిగా పనిచేసి, ప్రస్తుతం తహసీల్దార్ హోదాలో ఉన్నారు.

రైతుల భూములకు చెందిన అడంగల్‌లో ఆరో నంబరు కాలమ్‌లో పట్టా భూమి అని ఉండాలి. అప్పుడే అది రైతుకు చెందినదై ఉంటుందని తెలిసిందే. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అర్జీలను స్వీకరిస్తూ స్వయంగా విచారిస్తున్న తహసీల్దారు కేవీ గోపాలకృష్ణకు ఒక వారం దాదాపు 25 మంది రైతులు అడంగల్‌లో తప్పులున్నాయని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కావటం లేదని అర్జీలనిచ్చారు. పిల్ల పెళ్లి పెట్టుకున్నామని, రిజిస్ట్రేషను కాకపోతే సమస్య వస్తుందని మొరపెట్టుకున్న రైతులూ ఉన్నారు. తర్వాతి వారం మరో 24 మంది ఇదే తరహాలో అర్జీలనిచ్చారు. రికార్డుల్లో చూస్తే అడంగల్ కాలమ్–6లో రకరకాలుగా నమోదై ఉన్నాయి.

రైతుల అర్జీలతో అడంగల్‌లో సరిచేయటంతోనే సరిపెట్టుకోలేదు. మండలంలోని భూమి రికార్డులను వెరిఫికేషన్ చేయించారు. మొత్తం 5,800 రైతులకు సంబంధించి రికార్డుల్లో పొరపాటుగా నమోదయ్యాయి. ఆయా భూములు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషనుకు వెళితే, తప్పు కనిపించదు... ప్రభుత్వ భూమిగా కనిపిస్తుంటాయి. దీంతో అధికారులు రిజిస్ట్రేషన్లను తిరస్కరిస్తున్నారు. అర్జీలు ఇవ్వకపోయినా అలాంటి రైతులందరికీ ఎప్పటికైనా సమస్యేనని భావించిన గోపాలకృష్ణ, ఉన్నతాధికారులకు ఈ విషయమై సిఫార్సు చేయించారు.

ఆన్‌లైన్‌లో..

ఎడిట్ ఆప్షన్‌కు అనుమతి రావటంతో కార్యాలయ బృందమంతా కలిసి 15 రోజుల్లో రికార్డులను సరిచేశారు. రైతుల్లో చాలామందికి తెలియకుండానే వారి సమస్యకు పరిష్కారం లభించింది. అలాగే గ్రీవెన్స్‌కు సంబంధించి అర్జీలు, వాటికి పరిష్కారానికి సంబంధించి వివరాలతో సహా ఫైల్స్ నిర్వహణలోనూ అప్‌డేట్‌గా ఉండటం ఉన్నతాధికారులకు నచ్చింది. ఫలితంగానే రిపబ్లిక్ డే రోజున ఉత్తమ తహసీల్దార్‌గా ప్రశంసాపత్రం అందజేశారు.

అధికారిక విధులతోనే సరిపెట్టుకోకుండా అభాగ్యులకు సాయం చేస్తూ, సామాజిక కార్యక్రమాలనూ చేపడుతున్నారు తహసీల్దార్ గోపాలకృష్ణ. అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వ సాయంతో పాటు దాతలతో మాట్లాడి వితరణ చేయిస్తున్నారు. స్వధార్ హోంలో ఉండే అనాథ యువతులు/ మహిళలు తయారుచేసే చేతి ఉత్పత్తుల మార్కెటింగ్ కోసమని స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదుట సొంతంగా దుకాణం పెట్టించారు. ఇలా రకరకాలుగా అందరి తలలో నాలుకలా ఉండటంతోనే అభినందనలూ అవార్డులు వస్తున్నాయి.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దుచేశారు. జిల్లా, డివిజన్, మున్సిపాలిటి, మండల స్థాయిల్లో జరిగే ఈ సమస్యల పరిష్కార వేదికను రద్దయినట్టు జిల్లా అధికారులు ప్రకటించారు. కృష్ణ–గుంటూరు నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలుతో ఎన్నికల ప్రవర్తన నియమావళి గత నెల 29వ తేదీనుంచి మార్చి 8వ తేదీ వరకు అమలులో ఉంటున్నందున అప్పటివరకు ప్రతి సోమవారం జరిగే ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే సమావేశాలు ఈనెల 3, 10, 17, 24 తేదీలు, మార్చి నెల 3వ తేదీన రద్దుచేసినట్టు వివరించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మద్యంకు డబ్బులివ్వలేదని హత్యాయత్నం

తెనాలిరూరల్: మద్యానికి డబ్బులివ్వ లేదని వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన బసవయ్య అద్దెకు ఆటోలను తిప్పుతుంటాడు. ఇతని వద్ద అంగలకుదురుకు చెందిన అనిల్ ఆటోలు అద్దెకు తీసుకుంటుంటాడు. అనిల్‌తో పాటు ఇస్లాంపేటకు చెందిన జూపల్లి వేణు, అతని స్నేహితుడు రాము శుక్రవారం రాత్రి మద్యం తాగడానికి బసవయ్యను డబ్బు అడుగగా అతను ఇచ్చేందుకు నిరాకరించాడు. తమ వద్ద ఉన్న కత్తితో అతని గొంతుపై పొడిచారు. బాధితుడు చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. సేకరించిన వివరాల ప్రకారం.. పట్టణ ఆర్ఆర్ నగర్‌కు చెందిన గంగా భవాని (42) మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స తీసుకుంటోంది. గత నెల 30వ తేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా గమనించిన కుటుంబసభ్యులుఉ ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



అమర్తలూరు (వేమూరు): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు చాలా అవసరమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావు తెలిపారు. అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మొక్కలు నాట్బారు. ఈ సందర్భంగా దాతలు మొక్కలు పంపిణీ చేశారన్నారు. పాఠశాలలో వివిధ మొక్కలు చాలా అవసరమన్నారు. పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు గిరిధర్, ఆదినారాయణ, శ్యామ్, మాజేటి వెంకటేశ్వరరావు, మధు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.